క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

కందుకూరు అర్బన్: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఉదయం 8:30 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్కే రఫీ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా పార్టీ జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్ ఉంటుందన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరుకావాలని రఫీ కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

సింగరాయకొండ: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు పార్టీ 13వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నట్లు పార్టీ మండల కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్సార్ భవన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా కేక్ కటింగ్ జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి తెలిపారు. వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారు, పార్టీ వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు, అభిమానులంతా అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపు నిచ్చారు.

మాలకొండ ఆదాయం రూ.8,84,363

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.8,84,363 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాస రావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.24,360, తలనీలాలు రూ.31,050, ప్రత్యేక దర్శనం రూ.2,03,800, లడ్డుప్రసాదాలు రూ.1,81,655లు, అన్నదానం రూ.3,73,038, రూమ్‌అద్దెలు రూ.33,800 వచ్చినట్లు పేర్కొన్నారు.

131 పొగాకు బేళ్లు కొనుగోలు

కనిగిరి రూరల్: కనిగిరి టుబాకో కేంద్రంలో శనివారం మూడు రోజు కూడా 131 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వేలానికి 181 బేళ్లు రాగా 50 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.200, కనిష్ట ధర రూ.195 పలికింది. సోమవారం మాచవరం, భూతంవారిపల్లి, పోలవరం, రాచగుండ్లపాడు రైతులు బార్నీకి మూడు బేళ్ల చొప్పున వేలం కేంద్రాలకు తీసుకురావాలని వేలం నిర్వాహణాధికారి పీకే వీరభద్ర తెలిపారు.

27 పొగాకు బేళ్లు తిరస్కరణ

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో సోమవారం జరిగిన వేలంలో 27 పొగాకు బేళ్లు తిరస్కరించారు. కారుమంచి గ్రామానికి చెందిన రైతులు 521 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 483 కొనుగోలు జరిగగా, 27 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ట ధర రూ. 200 కాగా, కనిష్ట ధర రూ. 195 పలికింది.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

వలేటివారిపాలెం: మండలంలోని చుండి మోడల్ స్కూల్ విద్యార్థులకు పోలినేని గ్రామానికి చెందిన ఎండ్లూరి ఆంజనేయులు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.5 వేల ఆర్థికసాయం

కనిగిరి రూరల్: తల్లిదండ్రులు కోల్పోయిన విద్యార్థినికి మదర్‌థెరిస్సా సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం రూ. 5వేల ఆర్థిక యం అందచేశారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థిని గుమ్మల స్వప్నకు చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ సుబ్బారెడ్డి, ఇస్కాన్ కమిటీ సభ్యుడు గుత్తిశ్రీధర్ చేతుల మీదుగా అందచేశారు. సభ్యులు సయ్యద్ నాయబ్ రసూల్, అరుణోధర్, పచ్చవశేఖర్, పీర్ల మస్తాన్‌వలి, అబ్రహం లింకన్, ద్రోణాదుల చెంచులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసరాల అందజేత

కందుకూరు అర్బన్: శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేదలకు అండగా నిలుస్తున్నారు. నలదలపూరు ఎస్సీ కాలనీ చెందిన వృద్ధులకు శనివారం రెండు నెలలకు సరిపడా బియ్యం, సరుకులు అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులు, దువ్వూరి స్వామిదాసు, చక్కా వెంకటకేశవరావు పాల్గొన్నారు.

విజేత కళాశాలలో సరస్వతి పూజ

కనిగిరి రూరల్: పట్టణంలోని విజేత ఎంఎస్ఎం జూనియర్ కళాశాలలో ఇస్కాన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు సరస్వతి పూజ చేశారు. పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు వత్తిడికి లోకు కాకుండా పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని బృంద సభ్యులు సూచించారు. అనంతరం ఇస్కాన్ దేవస్థానం నుంచి తెప్పించిన ప్యాడ్స్, పెన్నులు కమిటీ సభ్యులు గుత్తి శ్రీధర్, డాక్టర్ సుబ్బారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. కళాశాల కరస్పాండెంట్ పి అరుణోధర్, మదర్ థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు సయ్యద్ నాయబ్ రసూల్, కోఆప్షన్ సభ్యుడు అబ్రహం లింకన్, పీర్ల మస్తాన్ వలి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బొట్టు శ్రీను, కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం
- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్


గురువాజీపేటలో యువతను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాం ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిలను గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. మండలంలోని గురువాజీపేటలో ఎమ్మెల్సీ ఎన్నికలపై శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో నాలుగు లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. వైజాగ్ సమ్మిట్‌కు తరలివచ్చిన పారిశ్రామిక వేత్తలు వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఎంఓయూలు కుదుర్చుకున్నారన్నారు. తద్వార సుమారు 6 లక్షల మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయని వివరించారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రకటించిన శ్యాం ప్రసాద్‌రెడ్డి, చంద్ర శేఖర్‌రెడ్డిలకు ప్రథమ ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, పార్టీ పట్టణ మండల అధ్యక్షులు రంగనాయకులరెడ్డి, అట్లా రామచంద్రారెడ్డి, సంగు సుబ్బారెడ్డి, రైతు అధ్యక్షుడు సిద్ధారెడ్డి, శ్రీహరిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, యూత్ నాయకులు పాల్గొన్నారు. కనిగిరి మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ మాణిక్యరావు కౌన్సిలర్లు శ్రీరాం సతీష్, దాసరి మురళీ, దేవరాజ్, అరుణోధర్, కోఆప్షన్ సభ్యుడు గూడూరి అబ్రహం లింకన్‌లు ప్రచారం చేశారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ బొట్టు శ్రీను, స్థానిక నాయకులు పాల్గొన్నారు. 3వ వార్డులో కౌన్సిలర్లు పెన్నా ఏడుకొండలు, దేవరాజ్, సచివాలయ కన్వీనర్లు మీరావలి, రవి, బాషా, షరీఫ్, రాష్ట్ర డైరెక్టర్ చెరుకూరి చిన కాశయ్య తదితరులు ప్రచారం చేశారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి


హెచ్ఎంపాడులో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు


మొగళ్లూరులో మాట్లాడుతున్న ఏఆర్ ఎస్పీ అశోక్‌బాబు


సింగరాయకొండ: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై షేక్ ఫిరోజ్ ఫాతిమా


విప్పగుంటలో మాట్లాడుతున్న ఎస్సై రాజారావు

వెలిగండ్ల: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు సూచించారు. మండలంలోని మొగళ్లూరు హైస్కూల్‌లో శనివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ అశోక్‌బాబు మాట్లాడుతూ ఆనందం, సంతోషం కోసం సిగిరెట్లు, మద్యాన్ని అలవాటు చేసుకుంటున్నారు. మాదక ద్రవ్యాలతో జీవితాన్ని కోల్పోతారన్నారు. మాదక ద్రవ్యాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రభుత్వం, పోలీస్‌శాఖ చర్యలు చేపడుతుందని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా సమాజ అభివృద్ధికి దోహదపడాలన్నారు. సీఐ కె.శ్రీనివాసరావు, హెచ్ఎం రాజాల కొండారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీసీపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఏఎస్పీ అశోక్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగేశ్వరరావుకు సూచనలు, సలహాలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి ప్రచారాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

హనుమంతునిపాడు: ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచే మంచి నడవడిక అలవర్చుకోవాలని ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కష్టపడి ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. బాల్య దశ నుంచే మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్సై జి.క్రిష్ణపావని, హెచ్ఎం జీవీ సురేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీసీపల్లి: యువత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తు పదార్థాలకు బానిసైతే బంగారం లాంటి భవిష్యత్ నాశనం అవుతుందన్నారు.

మాదకద్రవ్యాలు ప్రమాదకరం

పొన్నలూరు: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి బాగా చదువుకోవాలని ఎస్సై దాసరి రాజరావు పేర్కొన్నారు. మండలంలోని విప్పగుంట జెడ్పీ పాఠశాల్లో శుక్రవారం ×సంకల్పం® కార్యక్రమం నిర్వహించి మాదకద్రవ్యాలు వలన కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులు కల్చర్ పేరుతో మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై చిన్న వయస్సులోనే జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు, గురువులు సూచించిన మంచి మార్గంలో నడుచుకోవాలన్నారు. సర్పంచ్ చొప్పర మహేంద్ర, హెచ్ఎం ఎస్. శివరామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: మాదక ద్రవ్యాలకు బానిసై యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవటమే కాక తల్లిదండ్రులకు క్షోభ మిగిలిస్తూ సమాజానికి చెడు చేస్తున్నారని ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక అమృత జూనియర్ కాలేజీలో శనివారం మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టాలపై విద్యార్థుల కోసం చేపట్టిన సంకల్ప కార్యక్రమంలో మాట్లాడారు. ఎస్సై ఫిరోజ్ ఫాతిమా మాట్లాడుతూ సమాజంలో మాదకద్రవ్యాల బారిన పడి యువత ఏవిధంగా తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారో ఆమె కళ్లకు కట్టినట్లు వివరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


వెలిగండ్లలో బూత్‌లను పరిశీలిస్తున్న సీఐ, తహసీల్దార్


పోలింగ్ కేంద్రాలు పరిశీలిస్తున్న ఏఎస్పీ


టంగుటూరులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్సై ఖాదర్ బాషా


సింగరాయకొండ- పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సీహెచ్ ఉష

హనుమంతునిపాడు: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బూత్‌లను ఏఎస్పీ అశోక్‌బాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో వసతులు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. కేంద్రాల్లో వసతులు ఉండేట్లు చూడాలని హెచ్ఎంకు సూచించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా చూసుకోవాలని ఎస్సై కృష్ణపావనికి సూచించారు.

వెలిగండ్ల: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. సీఐ కె.శ్రీనివాసరావు, తహసీల్దార్ సి.నాగార్జునరెడ్డిలు శనివారం రెండు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. కేంద్రాల్లో ఫ్యాన్లు, లైటింగ్, ఓటు వేసే ప్రదేశం, ఏజెంట్లు కూర్చునే ప్రదేశాన్ని పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు తహసీల్దార్, పోలీసు శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఏఎస్సై కె.హనుమంతరావు, వీఆర్‌ఓలు బెంజిమెన్, పద్మనాభం ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

సింగరాయకొండ: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ సి.హెచ్ ఉష శనివారం తెలిపారు. స్థానిక ఏఆర్‌సి అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పోలింగ్ బూత్‌లను ఏర్పాట్లు చేశామన్నారు. ఉపాధ్యాయ ఓటర్లకు సంబంధించి బూత్ నెంబరు 40 ని కేటాయించగా, పట్టభద్రుల ఓటర్లకు 84, 85, 86 నెంబర్ల పోలింగ్ బూత్‌లను కేటాయించినట్లు ఆమె వివరించారు. ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా తో కలిసి పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు చెప్పారు.

144 సెక్షన్ విధింపు

కొండపి: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఆయా పోలింగ్‌బూత్‌ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తహసీల్దార్ టి. సింగారావు శనివారం తెలిపారు. వివిధ పోలింగ్ కేంద్రాల ఓట్ల శాతం వివరించారు.

టంగుటూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేమనున్నట్లు ఎస్సై ఖాదర్ బాషా తెలిపారు. శనివారం పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ చిరంజీవితో కలిసి పరిశీలించారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

క్రమశిక్షణతో ముందుకు సాగండి


మాట్లాడుతున్న తహసీల్దార్ సుధాకరరావు

లింగసముద్రం: విద్యార్థులు ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమశిక్షణతో ముందుకు సాగాలని తహసీల్దార్ సుధాకర్‌రావు అన్నారు. స్థానిక కేఆర్‌జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కె.సూర్యప్రకాశరావు అధ్యక్షతన పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో తహసీల్దార్ సుధాకర్, ఎస్సై వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చన్నారు. రానున్న పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షింఆరు.

లక్ష్మీ గణపతి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


పూజలు చేస్తున్న దంపతులు

సీఎస్‌పురం: మండలంలోని అయ్యలూరివారిపల్లిలో లక్ష్మీ గణపతి ఆలయ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో బస్టాండ్ సెంటర్‌లో లక్ష్మీ గణపతి ఆలయం నిర్మించేందుకు గ్రామస్తులు తీర్మానించారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు, హోమ పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని పూజలు, శంకుస్థాపన పూజలు చేశారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి


మృతి చెందిన గేదెలు

కనిగిరి రూరల్: విద్యుత్ షాక్ తగిలి రెండు గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన శనివారం పట్టణంలోని కొత్తూరు పొలాల్లో జరిగింది. పట్టణంలోని 9వ వార్డుకు చెందిన సీహెచ్ వెంకట లక్ష్మమ్మకు చెందిన రెండు గేదెలు మేతకు వెళ్లి ప్రమాదవశాత్తు పొలంలో తెగి పడి ఉన్న విద్యుత్ వైద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ రూ.1.70లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపింది.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

మర్రిపూడి: పృథులగిరి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఏకాంతసేవతో ముగిసినట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ కుప్పం చినకొల్లారావు, కార్యనిర్వాహ ణాధికారి బి. శ్రీనివాసులు తెలిపారు. చుండి లక్ష్మీనరసింహారావు, కనక రాఘవరావు ఉభయదాతలుగా వ్యవహరించారు.

వైస్ ఎంపీపీని ఆశీర్వదించిన ఎమ్మెల్యే


వైస్ ఎంపీపీ భారతీయాదవ్‌ను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే బుర్రా

వెలిగండ్ల: వెలిగండ్ల వైస్ ఎంపీపీ డాక్టర్ వై భారతియాదవ్ వివాహం శనివారం అగ్రహారంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ పాల్గొని భారతీ యాదవ్‌ను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు రామన తిరుపతిరెడ్డి, జార్జి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ టి.దేవసహాయం, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ పొల్లా సుబ్రహ్మణ్యం, సింగిల్‌విండో చైర్మెన్ కాకర్ల వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ టి.సుకుమార్, తహసీల్దార్ సి.నాగార్జునరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం


సింగరాయకొండ-సుందర్‌నగర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వరికూటి


పామూరులో ప్రచారం నిర్వహిస్తున్న నేతలు


ముద్దపాడులో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు


ఉలవపాడులో ప్రచారం..

పామూరు: ఎమ్మెల్సీ ఎన్నికలపై మండలంలో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో తూర్పు రాయలసీమ వైఎస్సార్ సీపీ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరి రామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు చాంద్‌బాషా, యాదాల వెంకట సాయికిరణ్, సచివాలయ మండల కన్వీనర్ ఖాదర్‌బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాలసురెడ్డి న్నారు. పెద్దగొల్లపల్లిలో తూర్పుపల్లి, పడమట పల్లి, కుడుములకుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, కన్వీనర్ యక్కంటి శ్రీనివాసలులరెడ్డి, యూత్ అధ్యక్షుడు భవనం క్రిష్టారెడ్డి, జి.ఆదినారాయణ రెడ్డి, ఎం తిరుపతయ్య, చక్కా రాము, రమణారెడ్డి, పి.శ్రీనివాలసరెడ్డి, గ్రామ కన్వీనర్లు పాల్గొన్నారు.

పీసీపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొర్రారెడ్డి, సొసైటీ చైర్మన్ పోలు జయరామిరెడ్డి, జెడ్పీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, ముద్దపాడు సర్పంచ్ మూలె రాజశేఖర్ రెడ్డి కోరారు. మండల పరిధిలోని పెదయిర్లపాడు, ముద్దపాడు సచివాలయల పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ శీలం సుదర్శనం, యూత్ అధ్యక్షుడు మేకల మాల్యాద్రి, సీనియర్ నాయకులు అలవల నరసింహారెడ్డి, బొడ్డుబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

సింగరాయకొండ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, పట్టభద్రులకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు.. పెద్దల సభలో మాట్లాడి పరిష్కరించాలంటే అది వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకే సాధ్యమని పార్టీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం స్థానిక సుందరనగర్‌లో ప్రచారం నిర్వహించారు. గతంలో పీడీఎఫ్ అభ్యర్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మద్దతుతో గెలిచారని కానీ.. జగన్ విద్యారంగంలో పెనుమార్పులు తీసుకుని రావటానికి ప్రయత్నిస్తుంటే.. ఆ అభ్యర్థులే మోకాలడ్డారని గుర్తు చేశారు. శ్రీవరాహ లక్ష్మీనరశింహ స్వామి దేవస్థాన ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, వడ్డేల కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, కొండపి ఏఎంసీ వైస్ చైర్మన్ మాలె రంగారెడ్డి, మండల జేసీఎస్ అధ్యక్షుడు తన్నీరు సుబ్బారావు, ఎస్.ఎల్ కుమార్, షేక్ పటేల్, సోమిశెట్టి సురేష్, వార్డు మెంబర్ పాదర్తి కోటేశ్వరరావు, గాదంశెట్టి గుప్తా, రాయి రమేష్, రాజు వెంకటేశ్వరరెడ్డి, షేక్ సలీం బాషా, షేక్ సలీం, శ్రీహరిరెడ్డి, సవళం కోటేశ్వరరావు, తన్నీరు వినోద్, ముళ్లపూడి సత్యన్నారాయణ పాల్గొన్నారు. బింగినపల్లి పంచాయతీలో వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, ఊళ్లపాలెం పంచాయతీలో పార్టి సీనియర్ నాయకుడు పాకనాటి సుబ్బారెడ్డి, శానంపూడిలో సర్పంచ్ బల్లెకూర బ్రహ్మయ్య, మాదాల శంకర్, రావినూతల అంకయ్య, ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఉలవపాడు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉపాధ్యాయ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటిశ్యామ్ ప్రసాద్ రెడ్డిని గెలిపించాలని ఉలవపాడులో వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు రామాలశింగారెడ్డి, వైస్ ఎంపీపీ సయ్యద్ ఫజుల్, మండల కన్వీనర్ చంద్రశేఖర్, మాజీ జెడ్పీటీసీ కోటిలింగం, నాయకులు కట్టా శ్రీను అహ్మద్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిపూడి: స్థానిక తూర్పు బజారు, నడిగడ్డ, ఎస్సీ కాలనీ, పడమటి బజారులో వైఎస్సార్ సీపీ నేతలు శనివారం రాత్రి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బోగసముద్రం విజయభాస్కర్‌రెడ్డి, పూనూరి సంజీవరెడ్డి, ఇనుకొల్లు కోటిరెడ్డి, కొమరరమణయ్య, సూరే రాఘవరెడ్డి, గండి జోసేఫ్, సూరే రమణారెడ్డి, గొంటు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలి


రామాయపట్నం పోర్టు వద్ద రక్తదానం చేస్తున్న పోర్టు సిబ్బంది

గుడ్లూరు: రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడి ప్రాణదాతలుగా నిలవాలని రామాయపట్నం పోర్టు నిర్మాణ సంస్థ అరబిందో ఇన్‌ఫ్రా ప్రాజెక్టు హెడ్ కంద పెరుమాళ్, ప్రాజెక్టు మేనేజర్ ఎంవీఎస్ శేషుకుమార్‌లు పేర్కొన్నారు. 52వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మొండివారిపాలెంలో రామాయపటం పోర్టు వద్ద అరబిందో ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో పోర్టు ప్రాజెక్టు సేఫ్టీ మేనేజర్ ఎస్.పోలారావు అధ్యక్షతన శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా పోర్టు పనులు జరుగుతున్న ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. పోర్టు వద్ద పని చేసే సిబ్బందిలో 53 మంది రక్తదానం చేశారు. కార్మికులకు వివిధ రకాల వృత్తి నైపుణ్యాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

రెండు వరిగడ్డి వాములు దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

గుడ్లూరు: ప్రమాదవశాత్తు నిప్పు రవ్వలంటుకొని రెండు వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన మండలంలోని రాళ్లపాడులో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన అలూరి మాలకొండయ్య, అద్దంకి వెంకయ్యలు కావలి పరిసర గ్రామాల్లో వరి గడ్డి కొనుగోలు చేసుకొని శనివారం ఉదయం ట్రాక్టర్లు ద్వారా గడ్డి తెచ్చుకొని ఇళ్ల వద్ద ఖాళీ స్థలంలో వాములు వేసుకున్నారు. మధ్యాహ్నం సమయంలో రెండు వాములు తగలబడి పొగలు వస్తుండటంతో చుట్టుపక్కల వారు గమనించి మాలకొండయ్య, వెంకయ్యలకు తెలియజేశారు. విషయాన్ని కందుకూరు అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే సగం వరిగడ్డి కాలిపోయింది. మిగతాది కూడ పొగసూరడంతో పశువులు తినవని బాధితులు వాపోయారు. రూ.40 వేల నష్టం వాటిల్లినట్లు తెలిపారు.